సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



వనజీవికి నివాళి

- ఉమ్మడి జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న రామయ్య
- ఆయనతో అనుభవాలను పంచుకున్న జిల్లావాసులు

8లో ▸

నిట్‌లో మేడారం జాతరపై జరిగిన జాతీయ ఓరియంటేషన్‌లో రామయ్య దంపతులను సన్మానించిన కార్యక్రమ బాధ్యులు (ఫైల్)

న్యూస్‌రీల్

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: రేపు(సోమవారం) జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జరిగే నిర్వహించన్ను రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సునీత శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు జిల్లాలోని అధికారులు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతుల నాయకులు, కార్మికులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అధికారి సునీత పిలుపునిచ్చారు.

గుండెపోటుతో ఎంపీడీఓ మృతి



మహబూబ్ హుస్సేన్(ఫైల్)

మొగుళ్లపల్లి: స్థానికంగా ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ మహబూబ్ హుస్సేన్ (61) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వస్థలం హనుమకొండ జిల్లా పరకాల అయినప్పటికీ కుటుంబ అవసరాల రీత్యా హనుమకొండ పట్టణంలో నివాసముంటూ విధులకు హాజరయ్యేవారు. విధి నిర్వహణలో బాధ్యతయుతంగా ఉంటూ.. ప్రజలందరికీ అందుబాటులో ఉండేవారని పేరుంది. వచ్చే నెలలో పదవి విరమణ చేయనుండగా.. ఇంతలోనే గుండెపోటుతో మృతి చెందడం అందరినీ కలిచివేసింది. ఆయన మృతిపై కార్యాలయ సిబ్బంది, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు.

టర్పెంటైన్ ఆయిల్ తాగి బాలుడి మృతి



సుహాస్ (ఫైల్)

కాటారం: టర్పెంటైన్ ఆయిల్ తాగి 21 నెలల బాలుడు మృతి చెందిన ఘటన కాటారం మండలం ధన్వాడలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధన్వాడ మాజీ ఎంపీటీసీ బోడ మమత నరేశ్ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు బోడ సుహాస్ (21 నెలలు) తల్లి మమతతోపాటు ఇంటి పక్కన వారింటికి వెళ్లాడు. మమత గుమ్మాలకు ముగ్గులు వేసే పనిలో నిమగ్నమవగా సుహాస్ ఆడుకుంటూ పెయింట్‌లో కలిపే టర్పెంటైన్ ఆయిల్ తాగాడు. కొంత సమయానికి సుహాస్ కిందపడిపోగా గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

మల్హర్: మండలంలోని నాచారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీసుల దాడులు నిర్వహించారు. ఈమేరకు 17 మంది వద్ద నుంచి రూ.1.50 లక్షలు, 5 బైకులు, 17 సెల్ ఫోన్లు, 52 ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నట్లు కొయ్యూరు ఎస్సై నరేష్ శనివారం తెలిపారు. 17 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'కక్ష సాధింపు కోసమే వక్ఫ్ బిల్లు'



భూపాలపల్లి అర్బన్: ముస్లిం మైనార్టీలపై కక్ష సాధింపు కోసమే బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ శనివారం సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలపై కక్ష సాధింపు కోసమే వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. ఈ చట్టాన్ని చాలా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ టీడీపీ, జేడీయూ పార్టీల సహకారంతో ఓటింగ్ ద్వారా చట్టాన్ని ఆమోదం చేసుకున్నారని అన్నారు. వక్ఫ్ బోర్డుకు ఇతర మతస్తులు సాయం చేయకుండా ఈ చట్టం తీసుకురావడం సరికాదన్నారు. హిందువులు, ఇతర మతస్తులు.. బోర్డుకు ఆర్థికంగా సహాయం చేయాలంటే వారు కూడా మతం మారాలని చట్టం తీసుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నూకల చంద్రమౌళి, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, యాకూబ్ పాషా, కృష్ణ, శేఖర్, రజియా, శ్రీలత, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యం పదిలమేనా..?

చిన్నారుల హెల్త్‌పై ప్రత్యేక దృష్టి

- అంగన్‌వాడీల్లో ఆరోగ్య పరీక్షలు
- జిల్లాలో నాలుగు బృందాల ద్వారా వైద్య పరీక్షలు
- మూడు నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళిక



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాటారం: అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తున్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి చికిత్స చేసేందుకు చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగా నేషనల్ హెల్త్ మిషన్, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఆరేళ్లలోపు చిన్నారుల్లో కంటి, మానసిక సమస్యలను ముందస్తుగా గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా వరల్డ్ హెల్త్ డే సందర్భంగా జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షల కార్యక్రమానికి వైద్య సిబ్బంది శ్రీకారం చుట్టారు. మూడు నెలల కాలంలో జిల్లాలోని అంగన్‌వాడీల్లోని మొత్తం చిన్నారులకు వైద్య పరీక్షలు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

10,364 మంది చిన్నారులు

జిల్లాలోని 643 అంగన్‌వాడీ కేంద్రాల్లో 0–6 సంవత్సరాల మధ్య వయస్సు గల 10,364 మంది చిన్నారులు ఉన్నారు. వీరందరికీ కంటి, మానసిక సమస్యల గుర్తింపు పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం ద్వారా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు రెండు విడతల్లో కంటి పరీక్షలు పూర్తయ్యాయి. ప్రస్తుతం మూడో విడతగా అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల చిన్నారులే ఎక్కువగా అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు. సరైన పర్యావేక్షణ లేకపోవడంతో వీరిలో కంటి, మానసిక సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో వీటిని చిన్న వయసులోనే గుర్తించి చికిత్స అందించాలని ప్రభుత్వం ఓ యోచనకు వచ్చింది.

జిల్లా వివరాలు..

మండలాలు	12
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	2
అంగన్‌వాడీ కేంద్రాలు	643
చిన్నారుల సంఖ్య	10,364

పరీక్షల విధానం ఇలా..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల వైద్య సిబ్బంది, కంటి వైద్యులు, అఫ్తాల్మిక్ నిపుణులు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కంటి పరీక్షల కోసం ప్రత్యేకంగా రూపొందించిన చార్ట్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ చార్ట్ బొమ్మలతో రూపొందించబడి ఉంటుంది. తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్ల సహకారంతో చూపుస్పష్టతను నిర్ధారిస్తారు. కంటి మచ్చలు, మెల్లకన్ను, కార్నియా సమస్యలు, కంటి తేమలోపం వంటి అంశాలను అఫ్తాల్మిక్ నిపుణులు పరిశీలిస్తారు. సమస్యలుంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తారు. మానసిక సమస్యల కోసం పీహెచ్‌సీ వైద్యాధికారులు చిన్నారుల ఎదుగుదల, ఎత్తు, బరువు, మాట లు, వస్తువుల గుర్తింపు, ప్రవర్తనలో మార్పులను పరీక్షిస్తారు.

రోజుకు 80 నుంచి 100 మందికి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారుల్లో అనారోగ్య, పౌష్టికాహార సమస్యలను నివారించేందుకు బాలామృతం, కోడిగుడ్లు లాంటి పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. అయినప్పటికీ చిన్నారుల్లో నేత్ర సమస్యలు పెరుగుతున్నాయి. దీంతో వైద్యపరీక్షలు కీలకం అని వైద్యాధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా నాలుగు వైద్య బృందాలు ప్రతి రోజు జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి 80 నుండి 100 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రుల సమక్షంలో వైద్య పరీక్షలు నిర్వహించి వారి మానసిక, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. వైద్యబృందం గుర్తించిన అంశాలను ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,500 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు పూర్తి చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

ప్రతీ చిన్నారికి వైద్య పరీక్షలు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ఆరేళ్ల లోపు చిన్నారులు ప్రతీ ఒక్కరి కంటి, మానసిక వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. నాలుగు బృందాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది రోజుకు 80 నుంచి 100 మంది చిన్నారులను పరీక్షిస్తున్నారు. సమస్య గుర్తించిన వారికి అవసరమైన చికిత్స అందేలా చర్యలు తీసుకుంటాం. ఈ వైద్య పరీక్షలు చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతాయి.

– డాక్టర్ ప్రమోద్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి



గోదావరికి పౌర్ణమి హారతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరికి పౌర్ణమి సందర్భంగా హారతి కార్యక్రమాన్ని దేవస్థానం ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, ఉప ప్రధాన అర్చకుడు ఫణీంద్రశర్మల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయం నుంచి అర్చకులు, అధికారులు, సిబ్బంది మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణలతో కాలినడకన గోదావరికి తరలివచ్చారు. అక్కడ గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరికి పాలు, పసుపు, కుంకుమ, పూలతోపాటు సారె సమర్పించారు. అనంతరం అర్చకులు మూడు హారతులతో హారతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ డి.శ్రీనివాస్, స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖలో అలసత్వం వహించొద్దు

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్



సమీక్ష నిర్వహిస్తున్న డైరెక్టర్ రవీంద్రనాయక్

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో వైద్యారోగ్యశాఖ కార్యక్రమాల్లో అలసత్వం వహించొద్దని రాష్ట్ర వైద్యారోగశాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాయక్ మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణ సేవలు, వ్యాధినిరోధక టీకాలు, ఎన్‌సీడీ, లెప్రసీ, టీబీ ఇతర కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహించొద్దని సూచించారు. ప్రాణహిత పుష్కరాల మెడికల్ క్యాంపు యాక్షన్ ప్లాన్ గురించి అడిగి తెలుసుకున్నారు. వరంగల్ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, పోగ్రాం అధికారులు కొమురయ్య, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ప్రమోద్ కుమార్, డాక్టర్ సందీప్, సపోర్టింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

రేగొండ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్ర నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులకు క్రమంతప్పకుండా పరీక్షలు చేయించాలని, ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీలు జరిగే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. కుష్టు, టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలను శిశువులందరికీ సకాలంలో వేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని ఫార్మసీ, ల్యాబ్, డెలివరీ, ఓపీ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. డీఎంహెచ్‌ఓ మధుసూదన్, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి, డాక్టర్ హిమబిందు, హెల్త్ సూపర్‌వైజర్లు సుధ, వినోద లక్ష్మీ, రాజేందర్, రాము, ఫార్మసిస్ట్ సులక్షణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత విద్య అవకాశాన్ని వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం బాధ్యులు

భూపాలపల్లి అర్బన్: పిపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్‌లో అందిస్తున్న ఉచిత కార్పొరేట్ స్థాయి విద్యను జిల్లాలోని విద్యార్థులు వినియోగించుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నక్క తిరుపతి, కొత్త కుమారస్వామి తెలిపారు. జిల్లా కేంద్రంలోని శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన గ్రామీణ నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించే లక్ష్యంతో ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 4, 5 ,6 తరగతి విద్యార్థులు అర్హత పరీక్ష రాసి 5, 6, 7 తరగతుల్లో ప్రవేశం పొందాలని సూచించారు. 80 మార్కులతో ఈ ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలుగు, గణితం, ఆంగ్లం పరిసరాల విజ్ఞానం నుంచి ప్రశ్నలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హత పొందిన విద్యార్థులకు వారు ప్రవేశం పొందిన తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతోపాటు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తారని తెలిపారు. గ్రామీణ నిరుపేదలు, తల్లిదండ్రులు లేని విద్యార్థులు అర్హులని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వెబ్‌సైట్ http:// forms.gle/ uhxD4 Dj8 oyxMUdPM7లో గూగుల్ ఫామ్ నింపి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 99124 62762, 95534 05934, 99491 74837 నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు సల్ల సంపత్, సుకుమార్, సరిత పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర



భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో శనివారం హనుమాన్ శోభాయాత్ర ఘనంగా సాగింది. హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై యాత్ర నిర్వహించారు. ఉదయం హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రాజ్యాంగంపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కరువు

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



రాజ్యాంగ స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న కొప్పుల ఈశ్వర్

కాటారం/కాళేశ్వరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగంపై చిత్తశుద్ధి లేదని, రాజ్యాంగాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆలోచన ఏ మాత్రం చేయడం లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కాటారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో బహుజన సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ స్థూపాన్ని మహదేవపూర్ మండలం సూరారంలో మాజీ సర్పంచ్ నాగుల సుజాత–లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణిరాకేశ్‌తో కలిసి ఈశ్వర్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈశ్వర్ మాట్లాడుతూ.. బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం, కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ప్రజల్లో చైతన్యం, హక్కులపై అవగాహన లేకుంటే ధైర్యంగా ముందుకెళ్లలేరని తెలిపారు. ఇన్నేళ్లుగా పరిపాలన చేసిన బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజ్యాంగం ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో విఫలమయ్యారని అన్నారు. రాజ్యాంగం ప్రజలకు తెలిస్తే తమని ప్రశ్నిస్తారనే కుట్ర పాలకుల్లో దాగిఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అబద్ధాలు, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. అంబేడ్కర్‌ను ఒక సామాజిక వర్గానికే అంటగట్టడం సమంజసం కాదన్నారు. రాజ్యాంగంలో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా రచించారని, కేవలం ఎస్సీలకు మాత్రమే మేలు చేస్తే బీసీ రిజర్వేషన్‌లు ఎలా సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామనే విషయాన్ని ప్రతీ ఒక్కరు గుర్తించాలన్నారు. పుట్ట మధు మాట్లాడుతూ మంథనిలో 40 ఏళ్లుగా పాలించిన ఒకే కుటుంబం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. సొంత ఖర్చులతో ప్రధాన కూడలిలో విగ్రహాన్ని ఏర్పాటు చేసిన లక్ష్మారెడ్డిని అభినందించారు. రాకేశ్ , శ్రీనివాస్, కిరణ్, తిరుపతి, శ్రావణ్, గీతాబాయి, శ్రీలక్ష్మిచౌదరి, శ్రీనివాసరావు, గీత, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అవసరమైతే బ్లాక్ లిస్టులోకి..

పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క
- పంచాయతీరాజ్ శాఖ, మిషన్ భగీరథపై హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష
- అభివృద్ధి పనుల తీరుపై ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల అసంతృప్తి
- ఏళ్లుగా పెండింగ్‌లోనే ఉంటున్నాయని అధికారులపై అసహనం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధనసరి సీతక్క. చిత్రంలో ఎంపీలు పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

హన్మకొండ: అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణనీటి సరఫరా, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా పంచాయతీరాజ్ శాఖ, మిషన్ భగీరథ శాఖలపై శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీతక్క మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనులు దక్కించుకోవడంలో చూపుతున్న శ్రద్ధ సకాలంలో పూర్తిచేయడంపై చూపడం లేదన్నారు. ఇప్పటికీ మొదలుపెట్టని పనులకు తిరిగి టెండర్లు పిలవాల ని సూచించారు. ఏళ్లుగా పనులు మొదలుపెట్టని, పూర్తిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలన్నారు. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా పనులు పూర్తి పూర్తిచేయించే బాధ్యత ఎస్ఈలదే అని, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి వారికి సూచనలు చేయాలన్నారు. టెండర్లకు సిద్ధంగా ఉన్న రోడ్లకు వారంలోగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి సకాలంలో పనులు పూర్తి చేయించాలని చెప్పారు. నిధుల కొరత లేదని, పీఎంజీఎస్‌వై నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లు ఇచ్చిందని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడం లేదు..

అభివృద్ధి పనులు జరుగుతున్న తీరుపై ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టినవి ఇప్పటికీ పూర్తి చేయలేదని, తన పదవి కాలంలోపైనా పూర్తి చేస్తారా అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో రోడ్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, రాంచంద్రునాయక్.. మంత్రి, ఈఎన్‌సీ కనకరత్నం దృష్టికి తీసుకెళ్లారు. పనులు పూర్తి చేయించడంలో అధికారులు వ్యవహరిస్తున్న వైఖరిపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం..

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని, తాను ప్రతిపాదనలు పంపిన రోడ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మీరు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఒక్కరే ఉన్నారని, అప్పుడు మీకు ప్రభుత్వం ఎంతగానో సహకరించిందని, ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఒక్కడినే ఉన్నానని, నిష్పక్షపాతంగా నియోజకవర్గ అభివృద్ధికి సహకరించి నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో ఎంపీ బలరాంనాయక్ కలుగజేసుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేస్తే తాము చెల్లిస్తున్నామన్నారు. దీంతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇక్కడ రాజకీయాలు చేయడం మంచిది కాదని, రాజకీయాలు బయట చూసుకుందామన్నారు. సమావేశంలో ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, కమిషనర్ కాంతి వెస్లీతో కలిసి ఉమ్మడి జిల్లాలోని జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలోని మారుమూల గ్రామమైన రాయినిగూడెంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఇష్టంగా తినే ఆహారంపై దృష్టి పెట్టాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడడమే అందరి లక్ష్యం కావాలన్నారు. అమ్మ మాట – అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని వచ్చే ఏడాది కూడా నిర్వహిస్తామన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

- రోడ్డుపై బైఠాయించిన లబ్ధిదారులు



ఆందోళన చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

కాటారం: గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారులకు మంజూరైన నిధులు విడుదల చేయాలని దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం కాటారంలో దళితబంధు ధర్మయుద్ధం మహాధర్నా నిర్వహించారు. చింతకాని క్రాస్ నుంచి మండల కేంద్రం వరకు ర్యాలీ చేపట్టిన లబ్ధిదారులు ప్రధానకూడలి లో జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సాధన సమితి జిల్లా అధ్యక్షుడు నమూండ్ల సంపత్ మహారాజ్ మాట్లాడుతూ దళితబంధు లేదా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మేరకు అంబేడ్కర్ అభయహస్తం అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నిధులను ఎంపికైన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని పేర్కొన్నారు. చదువుకున్న దళిత మహిళలకు పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చూడాలని, దివ్యాంగులకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. దళితబంధు నిధుల విడుదలకు కలెక్టర్ హామీ ఇవ్వాలని భీష్మించారు. సుమారు నాలుగు గంటలపాటు ధర్నా కొనసాగడంతో ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సైలు నరేశ్, మహేందర్.. ఆందోళన విరమింపజేశారు. ఆందోళనలో జక్కయ్య, వెంకయ్య, మధుకర్, శ్రీనివాస్, చందు, నగేశ్, రాజు, రామన్న, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తతో బాలుడి బలి..

- ట్రాలీ మీద పడి దుర్మరణం
- గిర్నితండాలో ఘటన


విఘ్నేశ్ (ఫైల్)

కొడకండ్ల : ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తతో ఓ బాలుడు బలి అయ్యాడు. ట్రాక్టర్ ట్రాలీ మీద పడి దుర్మరణం చెందాడు. ఈ విషాదకర ఘటన శనివారం తెల్లవారుజామున మండలంలోని గిర్నితండా శివారులోని పెట్రోల్ బంక్ ఎదుట ఉన్న ఇటుక బట్టీల వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై చింత రాజు కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా వేరుపాలెం మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన పెనుగొండ కృష్ణ కొడకండ్ల మండలం గిర్నితండా పరిధిలోని పెట్రోల్ బంక్ ఎదుట ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నాడు. ఇటుక బట్టీలకు మట్టి సరఫరా చేసే క్రమంలో ట్రాక్టర్ల లెక్కింపు చేపట్టేందుకు మొండ్రాయి గ్రామానికి చెందిన బాలుడు తండా విఘ్నేశ్(17)ను పనికి కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో బోడోనికుంటకు చెందిన భూక్య రవి.. మట్టి ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడపడంతో ట్రాలీ పల్టీకొట్టి పక్కన ట్రిప్పుల లెక్క రాస్తున్న విఘ్నేశ్‌పై పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విగ్నేశ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న తండా భాస్కర్‌కు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు విఘ్నేశ్ ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాశాడు. ట్రాక్టర్ నిర్లక్ష్యంగా నడిపి తన కుమారుడి మృతికి కారణమైన డ్రైవర్‌తో పాటు మైనర్ అని తెలిసినా పనికి కుదుర్చుకున్న ఇటుక బట్టీ యాజమానిపై చర్యలు తీసుకోవాలనే మృతుడి తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రసాద్ ఆలోచన విధానం ఆదర్శనీయం

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నవీన్

విద్యారణ్యపురి: న్యాయవాది కేఎస్ఆర్ జి.ప్రసాద్ ఆలోచన విధానం ఆదర్శనీయమని ప్రముఖ నవలాకారుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. శనివారం హనుమకొండలోని నవీన్ నివాసంలో మిత్రమండలి, రుద్రమ సాహిత్య సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో 'కేఎస్ఆర్ జి.ప్రసాద్ జీవితం, కృషి, వర్తమానం' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రసాద్ విలువలతో కూడిన జీవితాన్ని గడిపారన్నారు. కార్యక్రమంలో రచయిత, విమర్శకుడు మెట్టు రవీందర్, రుద్రమ సాహిత్య సామాజిక అధ్యయన వేదిక అధ్యక్షురాలు అనిశెట్టి రజిత, న్యాయవాది దివంగత కేఎస్ఆర్ జి.ప్రసాద్ కుమారుడు డాక్టర్ సతీశ్‌చంద్ర, మిత్ర మండలి కన్వీనర్ వీఆర్ విద్యార్థి, తెరసం అధ్యక్షుడు పొట్లపెల్లి శ్రీనివాస్ రావు, రుద్రమ సాహిత్య సామాజిక వేదిక బాధ్యురాలు కొమర్రాజు రామలక్ష్మీప్రసాద్ జీవితాన్ని పరిచయం చేశారు. సాహితీవేత్తలు నాగిళ్ల రామశాస్త్రి, పి.చందు, బిల్ల మహేందర్, చందనాల సుమిత్రా దేవి, డి.శశికిరణ్, తదితరులు పాల్గొన్నారు.


కాజీపేటలోని బీసీ గురుకుల ఉమెన్ 'లా' కాలేజీ భవనం..

గురుకు'లా' ల్లోనూ చదవొచ్చు..

గురుకులాల ద్వారా ఉచితంగా న్యాయవిద్య

- ఐదేళ్ల 'లా' కోర్సు.. టీజీ లాసెట్ ద్వారానే సీట్ల భర్తీ
- రెండేళ్ల క్రితం కాజీపేటలో ఉమెన్, హైదరాబాద్ మహేశ్వరంలో మెన్ కళాశాలలు ఏర్పాటు..
- హాస్టల్ వసతి, మెస్ ఇతర సదుపాయాలు

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్ల క్రితం వరకు యూనివర్సిటీ కాలేజీలు, ప్రైవేట్ కాలేజీల్లోనే 'లా' చదువుకోవాల్సి వచ్చేది. దీనికి వేలాది రూపాయల ఫీజులు చెల్లించాల్సిందే. ముఖ్యంగా యూనివర్సిటీల కాలేజీల్లో సీట్లకు డిమాండ్ ఎక్కువ ఉంటుంది. ప్రైవేట్ లాకాలేజీల్లోనూ అధిక ఫీజులు చెల్లించి చదువుతున్నారు. మేనేజ్‌మెంట్ కోటాలో సంవత్సరానికి రూ.లక్ష ఫీజు తీసుకునే కాలేజీలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో న్యాయవాద వృత్తిలో స్థిరపడాలనుకునే పేద విద్యార్థినీ, విద్యార్థులకు రాష్ట్రంలోని బీసీ గురుకులాల్లో ఉచితంగా న్యాయ విద్యనందించేందుకు ప్రభుత్వం రెండేళ్ల క్రితమే చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మహాత్మాజ్యోతిబాపూలే బలహీనవర్గాల విద్యాలయాల సంస్థ ద్వారా ఐదేళ్ల 'లా' కోర్సు ఉచితం అందజేస్తోంది. కాగా, కొన్నేళ్ల క్రితమే రాష్ట్రంలో హైదరాబాద్‌లోని చైతన్యపురిలో సాంఘిక సంక్షేమ గురుకులం బాలికల 'లా' కళాశాలగా ఉంది. అలాగే, సంగారెడ్డిలో గిరిజన సంక్షేమ గురుకులం బాలుర 'లా' కళాశాలగా ఉంది.

బీసీ గురుకులాల ద్వారా..

తెలంగాణ ప్రభుత్వం బీసీ గురుకులాల ద్వారా న్యాయ విద్యనందిస్తుంది. ఇందులో భాగంగా 2023–2024 విద్యాసంవత్సరంలో కాజీపేట సోమిడి రోడ్డులో గురుకుల 'లా' ఉమెన్ కళాశాల ఏర్పాటు చేసింది. అలాగే, హైదరాబాద్ మహేశ్వరంలో గురుకుల 'లా' మెన్ కాలేజీ నిర్వహిస్తోంది. వీటిల్లో ప్రవేశాలకు టీజీ లాసెట్ ద్వారానే అడ్మిషన్లు కల్పిస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల్లో తక్కువ ఆదాయం కలిగిన పేద కుటుంబాలకు చెందిన ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ 'లా' గురుకులాల్లో అడ్మిషన్లు పొందొచ్చు.

అనేక సదుపాయాలు..

ఈ గురుకుల 'లా' కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ల గరిష్ఠ వయోపరిమితి 20 ఏళ్లు ఉంది. వివాహితులకు ప్రవేశం లేదు. విద్యార్థినులు అడ్మిషన్లు పొందాక తప్పనిసరిగా హాస్టల్ వసతి పొందాల్సింటుంది. ఉచితంగా హాస్టల్‌వసతితోపాటు మెస్‌సదుపాయం ఉంటుంది. ఉచితంగా యూనిఫామ్స్, బుక్స్, నోట్‌బుక్స్ కూడా అందజేస్తారు.

కాజీపేట గురుకుల కళాశాలలో 60 సీట్లు..

ప్రస్తుతం హనుమకొండ జిల్లా కాజీపేట సోమిడిలో ఉన్న గురుకుల 'లా' కళాశాలలో విద్యార్థినులకు ఈ విద్యాసంవత్సరం 2025–2026లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు 60 సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆ కళాశాలలో ఫస్టియర్‌లో 24 మంది, సెకండియర్‌లో 30 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ప్రతీ విద్యాసంవత్సరంలో 60 సీట్లు ఉన్నా పూర్తిస్థాయిలో భర్తీకావడం లేదు. న్యాయవిద్యలో స్థిరపడాలనుకునేవారు ఈ గురుకులంలో అడ్మిషన్లు పొందాలని అధికారులు కోరుతున్నారు. హైదరాబాద్‌లోని మహేశ్వరంలో గురుకుల 'లా' మెన్ కళాశాలలో కూడా 60 సీట్లు ఉన్నాయి.

ఇప్పటికే టీజీ లాసెట్ నోటిఫికేషన్

తెలంగాణలో వివిధ యూనివర్సిటీల పరిధిలోని 'లా' కళాశాలల్లో 2025–2026 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకుగాను ఉస్మానియా యూనివర్సిటీ ఇప్పటికే టీజీలాసెట్ నోటిఫికేషన్ జారీచేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. అపరాధ రుసుములేకుండా రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 15 వతేదీ వరకు గడువు ఉంది. రూ. 5 వందల అపరాధ రుసుముతో ఈనెల 25వరకు, రూ. వెయ్యితో మే 5 వరకు, రూ. 2వేలతో మే 15వరకు, రూ 4వేల అపరాధ రుసుముతోమే 25వతేదీవరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ఉంది. కాగా, లాసెట్ జూన్ 6న జరగబోతుంది.

ఎవరికెన్ని సీట్లు..

బీసీ గురుకుల 'లా' కాలేజీలో ఉన్న 60 సీట్లలో బీసీఏ– 13, బీసీ– బీ 15, బీసీ–సీ 2, బీసీ –డీ 11, బీసీ –ఈ 6, ఈబీసీ 1, ఎస్సీ–9, ఎస్టీ –3 సీట్లు కేటాయిస్తారు. ఈ బీసీ గురుకులంలో మొదటి, రెండో సంవత్సరం కలిపి ప్రస్తుతం 54 మంది విద్యార్థినులు చదువుతున్నారు.లాసెట్ ద్వారానే ఈ విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ఇవ్వనున్నారు.

నామమాత్రపు ఫీజు

ఐదేళ్ల 'లా' కోర్సులో ప్రవేశానికి నామమాత్రపు ఫీజు కేవలం రూ. 4వేలు మాత్రమే ఉంది. రూ. 4వేలు కాషన్ డిపాజిట్‌గా అడ్మిషన్ల సమయంలో చెల్లించాల్సింటుంది. కోర్సు పూర్తిచేశాక విద్యార్థులకు తిరిగి చెల్లిస్తారు.

నాణ్యమైన న్యాయ విద్య



గురుకుల 'లా' ఉమెన్స్ కాలేజీలో నాణ్యమైన న్యాయ విద్యనందిస్తున్నాం. నిరంతర పర్యవేక్షణతోపాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన చేయిస్తున్నాం. న్యాయవాద వృత్తిలో స్థిరపడాలనే విద్యార్థినులు గురుకుల 'లా' కళాశాలలో టీజీసెట్ ద్వారా అడ్మిషన్లు పొందాలి.

– ఎస్ రవి, ప్రిన్సిపాల్, ఎంజేపీటీబీసీడబ్ల్యూ గురుకుల 'లా' ఉమెన్ కాలేజీ, కాజీపేట

నిరుపేదలందరికీ నూతన రేషన్ కార్డులు


గొత్తికోయలతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సీతక్క

- రాష్ట్ర మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: రానున్న రోజుల్లో రేషన్ కార్డు లేని నిరుపేదలందరికీ నూతన కార్డులు పంపిణీ చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం మండలంలోని మండల తోగు గూడెంలోని పాఠశాలలో గొత్తికోయలు, విద్యార్థులతో కలిసి మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ సన్నబియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలు కడుపునిండా అన్నం తినాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. జిల్లాలో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున రెండు లక్షల 57 వేల మందికి సన్న బియ్యం అందజేస్తున్నామని వివరించారు. ఆదివాసీ గూడేలు, ఏజెన్సీ గ్రామాల్లో ప్రభుత్వ పథకాలన్నీ అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేశ్‌బాబు, ఎంపీడీఓ సుమనవాణి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ పాల్గొన్నారు.

ప్రజలకు ఏం చేశారని రజతోత్సవ సభ

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలను మోసం చేసినందుకా..? ఏం చేశారని రజతోత్సవ సభ పెట్టుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి, దళితుడిని సీఎం చేస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని.. ఇలాంటి అనేక హామీలు ఇచ్చి పదేళ్లు ప్రజలను మోసం చేసి, పీడించినందుకా సంబురాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. ఇంతకీ 25 సంవత్సరాల ఉత్సవాలు టీఆర్ఎస్ పార్టీకా, తెలంగాణ పదాన్ని తీసేసిన బీఆర్ఎస్ పార్టీకా అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పై దుష్ప్రచారం చేయడమే బీఆర్ఎస్ ఎజెండా తప్పితే మరో అంశం లేదన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, నాయకులు డాక్టర్లు పెరుమాండ్ల రామకృష్ణ, పులి అనిల్, బంక సరళ, బంక సంపత్, నాయిని లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడారం, ఏటూరునాగారం మధ్య పులి జాడలు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎఫ్‌డీఓ రమేశ్


అటవీ శాఖ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎఫ్‌డీఓ రమేశ్

ఏటూరునాగారం : ములుగు జిల్లా తాడ్వాయి, ఏటూరునాగారం అడవుల మధ్య పులి సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని అటవీశాఖ డివిజనల్ అధికారి రమేశ్ శనివారం తెలిపారు. ఏటూరునాగారం నుంచి తాడ్వాయి మండలంలోని మేడారం, బయ్యక్కపేట అడవుల్లో సిబ్బందితో కలిసి పులి జాడ కోసం వెతుకుతున్నామన్నారు. మహాదేవ్‌పూర్ ప్రాంతం బూడిదపెంట గొత్తికోయ గూడెంలో ఓ ఆవును చంపి ఇటువైపు వచ్చినట్లు అక్కడి అటవీశాఖ అధికారుల సమాచారం ఉందన్నారు. ఈ మేరకు అడవులకు దగ్గరలోని ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. ఎవరూ అడవులకు వెళ్లొద్దని సూచించారు. పులి ఆనవాళ్లు, జాడలు కనిపిస్తే వెంటనే అటవీశాఖకు తెలపాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారులు అబ్దుల్ రెహమాన్, అఫ్సరున్నిసా తోపాటు సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

కడియం రాజీనామా చేసే వరకు వదలం

- భూ చెర పడుతున్న ఆంధ్రా అల్లుడు, బినామీలు
- గురువులకు పంగనామాలు పెట్టడంలో సిద్ధహస్తుడు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హన్మకొండ: బీఆర్ఎస్ శ్రేణులు శ్రమించి గెలిపించిన కడియం శ్రీహరి రాజీనామా చేసే వరకు వదిలిపెట్టమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గులాబీ జెండా మీద, బీఆర్ఎస్ కార్యకర్తల కష్టం మీద గెలిచిన కడియం శ్రీహరికి సిగ్గూ శరం, చీము నెత్తురుంటే వెంటనే రాజీనామా చేసి ఉప ఎన్నికలో గెలిచి మాట్లాడాలని హితవు పలికారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు, తాటికొండ రాజయ్య, తనపై ఇష్టం వచ్చినట్లు బూతులు మాట్లాడారని, దీనిని కడియం విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఆంధ్రా అల్లుడు, బినామీలు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో భూములు చెర బట్టారని ధ్వజమెత్తారు. దేవునూర్‌లో 25 ఎకరాలు బినామీ పేరుతో కొనుగోలు చేసి వ్యవసాయం చేయించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నీతివంతునివైతే హైదరాబాద్‌లో మూడు భవనాలు, అమెరికాలో మూడు భవనాలు ఎక్కడి నుంచి వచ్చాయని, హనుమకొండలో అంత పెద్ద ఇల్లు ఎలా నిర్మించావని తూర్పారబట్టారు. కడియం కంటే తాను ఒక్క రోజు తన సొంత నియోజకవర్గంలో లేకున్నా రాజీనామా చేస్తానన్నారు. కడియం తన మొదటి గురువు ఎన్టీఆర్, రెండో గురువు చంద్రబాబు, మూడో గురువు కేసీఆర్‌కు పంగనామాలు పెట్టాడని, కొత్త గురువు రేవంత్ రెడ్డికి కూడా పంగనామాలు పెడతారని పల్లా దుయ్యబట్టారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ నాయకులపై కడియం శ్రీహరి నోరు పారేసుకోవడాన్ని ఖండించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, నన్నపునేని నరేందర్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు ఇండ్ల నాగేశ్వర్‌రావు, గున్‌రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, పులి రజనీకాంత్, జోరిక రమేశ్, చింతల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించినట్లు నిరూపిస్తే రాజీనామా

- పట్టా భూములను రైతులకు చెందాలనడం కబ్జా చేసినట్టా?
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ రూరల్: దేవునూర్ అటవీ భూమిలో గుంట స్థలం ఆక్రమించినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపణలు, విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే అంటూ పదేపదే పదవికి రాజీనామా చేయాలనడం సరికాదన్నారు. ప్రస్తుతం ఈ విషయం సుప్రీం కోర్టులో ఉందని, తీర్పునకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 36మంది ఎమ్మెల్యేలు పార్టీ మారి బీఆర్ఎస్‌లో చేరిన విషయం రాజేశ్వర్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. వేరే పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కట్టబెట్టింది నిజం కదా అంటూ.. పార్టీ ఫిరాయింపుల మీద మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్యకు బీ ఫామ్ ఇచ్చి ఎన్నికల ఖర్చుకు నిధులు ఇచ్చామనడం సరికాదని, ఇది నిరూపిస్తే తమ పదవులకు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నిరూపించకపోతే పల్లా రాజీనామా చేయాలన్నారు. అటవీ శాఖ నోటిఫికేషన్‌లో లేని 23 మంది రైతులకు చెందిన 43 ఎకరాల పట్టా భూములను రైతులకు చెందాలని అనడం భూమి కబ్జా చేసినట్టా అని ప్రశ్నించారు. దమ్ముంటే అభివృద్ధిలో పోటీ పడాలని హితవు పలికారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులు అదజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, గుడి వంశీధర్‌రెడ్డి, ప్రవీణ్, కోళ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

వనజీవికి నివాళి

- ఉమ్మడి జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న రామయ్య
- ఆయనతో అనుభవాలను పంచుకున్న జిల్లావాసులు


వల్లంపట్ల కళాబృందంతో రామయ్య దంపతులు (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ పురస్కార అవార్డు గ్రహీత వనజీవి (దరిపల్లి) రామయ్యకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వన ప్రేమికులు, ఆయన అభిమానులు నివాళులర్పించారు. రామయ్య శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. వనప్రేమికులు, అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఓరుగల్లుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృక్షప్రేమికులు నిర్వహించిన 'చెట్లు నాటాలి– భూతాపాన్ని తగ్గించాలి' అనే అంశంపై 2019లో అక్టోబర్ 19న హనుమకొండ కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రామయ్య దంపతులు పాల్గొని మొక్కల పెంపకం, వాటి సంరక్షణపై ప్రసంగించారు.

ఏకశిల యునెస్కో క్లబ్ ఆధ్వర్యంలో 2020లో ఫిబ్రవరి 2, 3వతేదీల్లో నిట్‌లో మేడారం జాతరపై జాతీయ ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామయ్య దంపతులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని క్లబ్ బాధ్యులు ఘనంగా సన్మానించారు.

నేటితరానికి రామయ్య ఆదర్శం..



నేటితరం రామయ్యను ఆదర్శంగా తీసుకోవాలి. ఆయనను కలిసి మాట్లాడా. మొక్కల పెంపకంపై రామయ్య కృషిని మరిచిపోవద్దు. పర్యావరణ పరిరక్షణకోసం ఆయన చేసిన వన ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి. ఇప్పటి నుంచి అందరం మొక్కలు నాటి హరిత విప్లవంలో భాగస్వాములమవుదాం..

– నిమ్మల శ్రీనివాస్, సామాజికవేత్త, హనుమకొండ

చెట్ల పెంపకంపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి..



మా క్లబ్ ఆధ్వర్యంలో నిట్‌లో మేడారం జాతరపై జాతీయ ఓరియంటేషన్‌కు రామయ్య దంపతులను ఆహ్వానించాం.. రామయ్య చెట్ల పెంపకంపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి.. జాతరలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రకృతికి హాని జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.. అలాగే, మొక్కలను ఎలా పెంచాలని వివరించిన తీరు ప్రశంసనీయం. రామయ్య దంపతులను క్లబ్ తరఫున ఘనంగా సన్మానించాం.

– ధర్మపురి రాజా గోవింద్, ఏకశిల యునెస్కో క్లబ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు

జానకమ్మ సహకారం గొప్పది..



పర్యావరణ పరిరక్షణలో రామయ్య రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు చేశారు. రామయ్యతో పాటు ఆయన సతీమణి జానకమ్మ కూడా ప్రతీ కార్యక్రమానికి హాజరయ్యేవారు. రామయ్య కృషిలో పాలుపంచుకునేవారు. ఆమె సహకారం గొప్పది.. తన పిల్లలతో పాటు మొక్కలను ప్రాణంగా పెంచుకున్నారు. ఎక్కడైనా ఖాళీస్థలం కనిపిస్తే విత్తనాలు చల్లుతూ, మొక్కలు నాటేవారు. రామయ్య మృతి తీరనిలోటు. నిట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనతో మాట్లాడా. ఆ దంపతులను సన్మానించా.

– వల్లంపట్ల నాగేశ్వరరావు, వనప్రేమి అవార్డు గ్రహీత, కవి, రచయిత, కళాకారుడు, హనుమకొండ

కలిసి మొక్కలు నాటాం...



మహబూబాబాద్ రూరల్ : ఎనిమిదేళ్ల క్రితం రామయ్య మహబూబాబాద్ రాగా ఆయనతో కలిసి మొక్కలు నాటాం. మా ఇంటికి వచ్చిన సమయంలో ఆ దంపతులను సన్మానించాం. రామయ్య మృతి సమాజానికి తీరనిలోటు. వనజీవి రామయ్యను ఆదర్శంగా తీసుకుని వందరోజుల పాటు నిరంతరంగా మొక్కలు నాటే యజ్ఞం నిర్వహించాం.

– గర్రెపల్లి వెంకటేశ్వర్లు, శ్రీవాసవి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మహబూబాబాద్